క్లుప్తంగా

ఆర్థిక లావాదేవీలపై అవగాహన అవసరం

గుడివాడ టౌన్: ఎంబీఏ విద్యార్థులకు ఆర్థిక లావాదేవీలు, ఆదాయం, వ్యయాలపై అవగాహన ఉండాలని స్టాక్ మార్కెట్ రిసోర్స్ పర్సన్ జి.సుధాకర్ అన్నారు. స్థానిక ఏఎన్నార్ కళాశాల్లో ఎంబీఏ విద్యార్థులకు సోమవారం ఆర్థిక స్వేచ్ఛ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టడంపై అవగాహన పెంచుకోవాలన్నారు. సెక్యూరిటీస్‌లో ఎలా పెట్టుబడి పెట్టాలి అనే అంశంపై పూర్తి అవగాహన అవసరం అన్నారు. స్టాక్ బ్రోకర్స్ సలహాలు, సూచనలు పరిగణనలోకి తీసుకోవడం మంచిదన్నారు. దీనికి అనుసంధానంగా మార్కెట్‌లో బ్యాంకుల నుంచి వచ్చే అప్పుల మీద అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కేఏస్ అప్పారావు, ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజ, ఎంబీఏ విభాగాధిపతి ఎంబీ సువర్చల పాల్గొన్నారు.

వీఆర్వో సంతకాలు ఫోర్జరీ చేసిన వారిపై చర్యలు తీసుకోండి

పమిడిముక్కల: పమిడిముక్కల మండలంలో గ్రామ రెవెన్యూ అధికారుల(వీఆర్వో) సంతకాలను ఫోర్జరీ చేసి ప్రభుత్వ స్థలాలను ఉయ్యూరు సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు చేసిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని కలెక్టరేట్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసినట్లు సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ తెలిపారు. పమిడిముక్కల తహసీల్దార్ ఫిర్యాదు మేరకు 2021వ సంవత్సరం జూన్ 3న స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేసినప్పటికీ, గత మూడు సంవత్సరాలుగా దర్యాప్తు పూర్తి కాలేదన్నారు. ఈ విషయమై జిల్లా ఎస్పీ తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు.

వృద్ధులకు అన్నసమారాధన



గుడివాడ టౌన్: శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పాటి మీద గల కరుణా పీఠం, బేతవోలు లోని శాంతి వృద్ధుల ఆశ్రమంలో అన్నసమారాధన నిర్వహించారు. సేవా సంఘం సభ్యులు కె. లవరాజు–రాధ దంపతుల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు సంఘం అధ్యక్షుడు పుట్టి హరికుమార్ తెలిపారు. కార్యక్రమంలో రూరల్ ఎస్సై లక్ష్మీ నరసింహమూర్తి, సర్దార్ గఫార్, మాకుల సత్యం, జాజుల తాతారావు, కె.రామచంద్రరావు పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్ పనులు ప్రారంభించాలని వినతి

మండవల్లి: ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందజేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన జలజీవన్ మిషన్ పనులు మండవల్లిలో తిరిగి ప్రారంభించాలని ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, మండల అధ్యక్షుడు టి.అప్పారావు పేర్కొన్నారు. మీ కోసం కార్యక్రమంలో సోమవారం ఈ మేరకు తహసీల్దార్ సుభానీకి వినతిపత్రం అందజేశారు. స్థానిక పంచాయతీకి రూ.68 లక్షల నిధులు మంజూరైనప్పటికీ, అధికారులు, పంచాయతీ నిర్లక్ష్యం కారణంగా పనులు పూర్తి కాలేదన్నారు. మండలంలోని పలు పంచాయతీల్లో పైపులైన్ వేయడం, ట్యాంక్ నిర్మాణాలు కూడా పూర్తి అయ్యాయన్నారు. నిలిచిపోయిన పనులు తిరిగి ప్రారంభించాలని కోరారు. బి.రంగారావు, ఎస్.షణ్ముఖరాజు, రంగయ్య పాల్గొన్నారు.

నందివాడ ఎస్ఐగా శ్రీనివాస్

నందివాడ: నందివాడ సబ్ ఇన్‌స్పెక్టర్ నంబూరు చంటిబాబును బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ గంగాధరరావు ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. ఈయన స్థానంలో పమిడిముక్కల ఎస్ఐగా పనిచేస్తున్న కె.శ్రీనివాస్‌ను నియమించారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి



పామర్రు: మండల పరిధిలోని రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నూతన తహసీల్దార్ రవికాంత్‌ను ఎంపీపీ మర్యాద పూర్వకంగా సోమవారం కలిశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో ఉన్న పలు సమస్యలను తహసీల్దార్ దృష్టికి తీసుకుకొచ్చామన్నారు. సానుకూలంగా స్పందించారని తెలిపారు. సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారని పేర్కొన్నారు.

తల్లిపాలతో ప్రయోజనాలు మెండు

మండవల్లి: తల్లిపాలతో బిడ్డలకు మెండుగా ప్రయోజనాలు చేకూరుతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ వెంకటనాగలక్ష్మి అన్నారు. కొవ్వాడలంక, మణుగునూరులో తల్లిపాల వారోత్సవాలు, మిషన్‌శక్తి కార్యక్రమాలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతను, తల్లిపాలలోని పోషక విలువలను గర్భిణులు, బాలింతలు, వారి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. అనంతరం ర్యాలీలు నిర్వహించారు. సాయిదుర్గ, నాగేశ్వరమ్మ, సంగీతవాణి, కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు రజని, ప్రభావతి, రాణి పాల్గొన్నారు.



మండవల్లిలో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీ

పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రుపాలు అందించాలి

పెదపారుపూడి: పుట్టిన బిడ్డకు గంటలోపు తల్లి ముర్రుపాలు అందిస్తే పిల్లలో రోగనిరోధక శక్తి పెరుగుతుందని పెదపారుపూడి సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణకుమారి అన్నారు. పెదపారుపూడి అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా బాలింతలు తీసుకోవాల్సిన ఆహారం, పోషకాలు గురించి అవగాహన కల్పించారు. గ్రామ సర్పంచ్ చప్పిడి సమీరా, హెల్త్ సూపర్‌వైజర్ పద్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నందివాడలో..

నందివాడ: నందివాడ అంగన్‌వాడీ–4లో సోమవారం తల్లి పాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ విజయ ఫ్లారెన్స్ మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు గంటలోపే ముర్రుపాలు పట్టించాలన్నారు. తల్లిపాలు తాగడం వలన బిడ్డలకు కలిగే లాభాలు, ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగశిరీష, సర్పంచ్ రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.



నందివాడ అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారాల ప్రదర్శన

తల్లి పాలు బిడ్డకు అమృతతుల్యం

పమిడిముక్కల: తల్లి పాలు బిడ్డకు అమృతతుల్యమని ఏఎన్ఎం ప్రభావతి తెలిపారు. ముళ్లపూడి అంగనవాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఏఎన్ఎం ప్రభావతి తల్లి పాల ప్రాముఖ్యతను వివరించారు.

తల్లిపాల ప్రాముఖ్యత తెలుసుకోవాలి

ప్రొకర్ల(పామర్రు): గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలకు తల్లిపాల అవగాహన కార్యక్రమం చేపట్టారు. బిడ్డకు ఆరు నెలల నిండే వరకు తల్లిపాలు మాత్రమే పట్టించాలని పేర్కొన్నారు.



పామర్రులో తల్లిపాల విశిష్టతపై అవగాహన ర్యాలీ

పామర్రులో..

పామర్రులోని సాయినగర్‌లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎన్.సత్యశ్రీ మాట్లాడుతూ తల్లిపాల వలన చిన్నారుల్లో వ్యాధి నిరోధక శక్తి ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో హెల్త్ విజిటర్ రమాకుమారి, ఏఎన్ఎం విజయభాను, సీహెచ్ఓ స్టీవెన్, అంగన్‌వాడీ కార్యకర్త శ్రీదేవి పాల్గొన్నారు.

దోమల నియంత్రణకు చర్యలు



తోట్లవల్లూరులో దోమల మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది



కనకదుర్గమ్మ కాలనీలో ఆయిల్ బాల్స్ వేస్తున్న వైద్య సిబ్బంది

తోట్లవల్లూరు: దోమల నియంత్రణకు అధికార యంత్రాంగం నడుం బిగించింది. 'దోమల విజృంభణతో జనం బెంబేలు' శీర్షికతో సాక్షిలో సోమవారం వార్త ప్రచురితమైన విషయం విదితమే. దీనిపై తోట్లవల్లూరు సర్పంచ్ పెనుమత్స రాధిక, ఎంపీడీఓ సత్యనారాయణ, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాయిప్రసన్న స్పందించారు. ఈ విషయమై పంచాయతీ, ఆరోగ్యశాఖల సిబ్బందిని అప్రమత్తం చేశారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గ్రామంలోని కనకదుర్గమ్మ కాలనీతో పాటు పలు ప్రాంతాల్లో దోమల నియంత్రణ మందు పిచికారీ చేయించారు. మురుగునీరు నిలువ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ విడుదల చేశారు. పంచాయతీ కార్యదర్శి పుష్పనాథం, గుమ్మస్తా సునీల్, ఎంపీహెచ్ఎస్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

సాక్షి ఎఫెక్ట్

ఎస్ఐ శ్రీనివాస్ సేవలు ప్రశంసనీయం

పమిడిముక్కల: పార్టీలకతీతంగా పనిచేసి మండలంలో అందరి మన్ననలు పొందిన ఎస్ఐ కె.శ్రీనివాస్ సేవలు ప్రశంసనీయమని వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. ఎస్ఐ శ్రీనివాస్‌ను ఇటీవల జరిగిన బదిలీల్లో నందివాడ మండలానికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా సోమవారం పోలీస్‌స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, ఎంపీటీసీ సభ్యుడు ఆదిశేషు, వైఎస్సార్ సీపీ నాయకులు పాతూరి చంద్రపాల్, కొక్కిలిగడ్డ ఆనంద్, కోటేశ్వరరావు, నాగార్జున ఎస్ఐను సత్కరించారు.



ఎస్ఐ శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తహసీల్దార్ రవికాంత్ బాధ్యతల స్వీకరణ

పామర్రు: పామర్రు తహసీల్దార్‌గా గూడపాటి రవికాంత్ సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండల ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు.అనంతరం వీఆర్వోలు, వీఆర్యేల సంఘ సభ్యులు తహసీల్దార్‌కు పూల బోకేలను ఇచ్చి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డీటీ నాగమల్లేశ్వరరావు, ఎన్నికల డీటీ జగన్‌మోహన్‌రావు, సిబ్బంది సీహెచ్ రాము, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ



బార్లపూడి(మొవ్వ): గ్రామాల్లో వైరల్ జ్వరాలు విజృంభిస్తుండడంతో గ్రామ పంచాయతీ అధికారులు శానిటేషన్‌పై దోమల నివారణపై నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగా సోమవారం బార్లపూడి గ్రామంలో దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. గ్రామ సర్పంచ్ కాకాని లీలా వెంకటదుర్గాప్రసాద్, పంచాయితీ కార్యదర్శి కుంభా వీరాంజనేయులు పనులను పర్యవేక్షించారు.

సంక్షిప్త వార్తలు

కబడ్డీలో విద్యార్థుల ప్రతిభ



అడ్డాడ(పామర్రు): విజ్ఞాన విహార జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో తమ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు అరవింద హైస్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.రమణమూర్తి పేర్కొన్నారు. మండలంలోని అడ్డాడ గ్రామంలో అరవింద స్కూల్లో విజేతలను సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజ్ఞాన విహార సంకులం విజయవాడ సమితి ఆధ్వర్యంలో ఎనికేపాడులో నిర్వహించిన కబడ్డీ బాల వర్గ అండర్–14 బాలుర, బాలికల విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానం సాధించారని తెలిపారు. విజేతలు ఈనెల 17,18 తేదీల్లో నర్సరావుపేటలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఖో–ఖో, బ్యాడ్మింటన్, చదరంగం పోటీల్లో హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి ద్వితీయ స్థానం సాధించి బహుమతులను సాధించారని తెలిపారు. విజేతలు, శిక్షణ ఇచ్చిన పీఈటీ సురేష్‌బాబుకు హైస్కూల్ ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

సత్యప్రసాద్‌కు ఘన నివాళి

పమిడిముక్కల: మండలంలోని మామిళ్లపల్లి గ్రామంలో సోమవారం కమ్యూనిస్టునేత ద్రోణవల్లి సత్యప్రసాద్ వర్ధంతిని గ్రామస్తులు నిర్వహించారు. గ్రామంలో సత్యప్రసాద్ స్మారక స్థూపం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. కమ్యూనిస్టు నాయకులు గొట్టిపాటి నాగేశ్వరరావు, గ్రామ పెద్దలు గొట్టిపాటి సత్యప్రసాద్, కొల్లూరి వెంకటరత్నం, చంద్రశేఖరరావు, ప్రసాద్, దండమూడి సత్యప్రసాద్ పాల్గొన్నారు.

ఆక్వా రైతులకు సబ్సిడీ అందించాలి

కైకలూరు: మండలంలో ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీని అందించాలని ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు అన్నారు. ఎంపీడీఓ డి.దినతేజ్ అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో విద్యుత్, మత్స్య, రెవెన్యూ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ 465 మంది ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ అందలేదన్నారు. ఆక్వా జోన్ నిబంధనల మేరకు 10 ఎకరాలలోపు రైతుల జాబితాలను మరో పర్యాయం పరిశీలించి అర్హులైన వారికి సబ్సిడీ అందించాలని కోరారు. డెప్యూటీ తహసీల్దారు ఇబ్రహీం, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి రవికుమార్, విద్యుత్‌శాఖ ఏఈ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రైతులు ఈ–పంట నమోదు చేయించుకోండి

పమిడిముక్కల: రైతులు తమ పొలాల్లో ఏ పంటలు వేశారో వివరాలు తెలిపి ఈ–పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి గణేష్‌రెడ్డి పేర్కొన్నారు. గుర్రాల్లంకలో రైతు కోగంటి శ్రీరామ్ పొలంలో సోమవారం జరుగుతున్న ఈ–పంట నమోదును ఏఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల వద్ద ఉన్న వ్యవసాయ సహాయకులను కలిసి ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఈ–పంట నమోదు చేసుకోవాలన్నారు. ఈ విధంగా నమోదైన రైతులకు మాత్రమే ప్రభుత్వం ద్వారా ధాన్యం కొనుగోలు, పంట నష్టం, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, అన్నదాత సుఖీభవ, సున్నా వడ్డీ తదితర పథకాలకు అర్హులవుతారన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

గుడివాడ టౌన్: ప్రతిఒక్కరూ ఒక మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపుదలకు కృషి చేయాలని బీజేపీ యువ మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శివరామకృష్ణరాజు అన్నారు. సోమవారం స్థానిక రాజేంద్రనగర్‌లోని పార్క్ స్కూల్లో బీజేపీ యువమోర్చ ఆధ్వర్యంలో జరిగిన మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఎర్రపోతు అర్జున్, అయోధ్యరామచంద్రరావు, సూరే గాంధీ, మురళి, స్టాలిన్, కె.కిరణ్, విష్ణు, లీలా సుధీర్ పాల్గొన్నారు.

శ్రావణమాస పూజలు ప్రారంభం

పామర్రు: శ్రావణ మాసం ప్రారంభాన్ని పురస్కరించుకుని స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి, అంకమ్మతల్లి ఆలయంలో అమ్మవారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు వరదా అప్పారావు తెలిపారు. స్థానిక వల్మీకేశ్వరీ ఆలయంలో ఆలయ నిర్వాహకులు రామకృష్ణారెడ్డి, సుశీల దంపతులు శ్రావణ మాస పూజలను ప్రారంభించారు. సోమేశ్వరస్వామి ఆలయంలోని పార్వతీ అమ్మవారికి పూజలు చేశారు. బుచ్చమ్మతల్లి ఆశ్రమంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలోని పర్వతవర్ధనీ దేవికి అభిషేకాలు నిర్వహించారు.

క్రికెటర్ సందీప్‌కు మాజీ ఎమ్మెల్యే డీఎన్నార్ అభినందన

కైకలూరు: ఆంధ్ర క్రికెట్ అసోషియేషన్ చరిత్రలో ఎక్కువ పరుగులు సాధించిన కైకలూరుకు చెందిన వై.సందీప్ మరిన్ని విజయాలు అధిరోహించాలని వైఎస్సార్ సీపీ మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) సోమవారం అభినందించారు. కైకలూరుకు చెందిన సీనియర్ క్రికెటర్ సురేంద్ర కుమారుడు వై.సందీప్ ఎన్టీఆర్ జిల్లాలో సీనియర్ ఇంటర్ జిల్లాల మ్యాచ్ కృష్ణా జిల్లా తరపున ఆడి మొదటి ఇన్నింగ్స్‌లో 405 పరుగులు సాధించి నాటౌట్‌గా నిలిచాడు. అసోషియేషన్‌లో ఇదే అదిపెద్ద స్కోరు కావడం విశేషం. కైకలూరు బృందావనం గేటెడ్ కమ్యూనిటీలో సురేంద్ర నివాసానికి వెళ్లిన డీఎన్నార్, ఆయన కుమారుడు శ్యామ్ ఫణికుమార్ సందీప్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



క్రికెటర్ సందీప్‌ను అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే డీఎన్నార్

తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎండీయూల ఆందోళన

పెదపారుపూడి: రేషన్ బియ్యం అందించే ఎండీయూ వ్యాన్ డ్రైవర్లు సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. కొత్తగా వచ్చిన తహసీల్దార్ రంగారావు ఎండీయూ(మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్)లకు ఫోన్ చేసి 'రోజుకు మీరు 250 మంది కార్డుదారులకు కచ్చితంగా రేషన్ అందించాల్సిందేను' అని ఆదేశాలిచ్చారని ఎండీయూలు పేర్కొన్నారు. రోజుకు సుమారు 100 మందికి మించి ఇవ్వలేమని డ్రైవర్లు వాపోయారు. ఏడుగురు ఎండీయూలు తహసీల్దార్ కార్యాలయానికి వ్యాన్‌లు తీసుకొచ్చి అక్కడే నిలిపివేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ డ్రైవర్లను పిలిచి మాట్లాడారు. గత ప్రభుత్వంలో తాము రోజుకు 100 మంది కార్డుదారులకు రేషన్ పంపిణీ చేసేవారమని చెప్పారు. ఇప్పుడు 250 మంది కార్డుదారులకు ఇవ్వకపోతే కుదరని చెప్పటంతో తమకు ఇబ్బందిగా ఉందన్నారు. ఇలాగైతే తాము పని చేయలేమని పేర్కొన్నారు. కనీసం 150 మందికైనా ఇవ్వాలని తహసీల్దార్ కోరారు. దీంతో ఎండీయూలు వెనుతిరిగి వెళ్లారు. వెంట్రప్రగడ ఎండీయూ పాల్ మాట్లాడుతూ తహసీల్దార్ రేషన్ విషయంలో ఇష్టనుసారంగా మాట్లాడటంతో చాలా బాధగా ఉందన్నారు. ఇప్పటికైనా పై స్థాయి అధికారులు స్పందించి రేషన్ అందించే రోజులు పెంచాలని కోరారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిలిపి వేసిన రేషన్ పంపిణీ వ్యాన్లు

కైకలూరు నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

కైకలూరు: నియోజకవర్గంలో ఎన్నికల వరకు మాత్రమే రాజకీయాలు చూడాలని తర్వాత అభివృద్ధే లక్ష్యంగా ప్రతిఒక్కరూ కలిసి పని చేయాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. ఎంపీపీ అడవి కృష్ణ అధ్యక్షతన రూ.9 లక్షలతో అభివృద్ధి చేసిన మండల పరిషత్ సమావేశ మందిరాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. అనంతరం ఎంపీపీ కార్యాలయ ఆవరణలో కామినేనిని సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తనకు వచ్చిన అవకాశాన్ని పదవిగా కాకుండా బాధ్యతగా భావిస్తానన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, జెడ్పీటీసీ కురెళ్ల బేబీ, ఎంపీటీసీ సభ్యుడు రామకృష్ణ, కూటమి నాయకులు పెన్మెత్స త్రినాథరాజు, ఏసురాజు, బాబీ, లక్ష్మి పాల్గొన్నారు.



కైకలూరు మండల పరిషత్ ఆవరణలో చిన్నారులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కామినేని

వెంకన్న గుడిలో పనులకు శంకుస్థాపన

మీసాల వెంకన్న స్వామి ఆలయంలో తూర్పు వీధి స్వాగత ద్వారం, వీటిపై దేవతాబొమ్మలు, భక్తుల సౌకర్యానికి మరుగుదొడ్ల నిర్మాణం, కాంపౌండ్ వాల్ వంటి పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కామినేని శంకుస్థాపన చేశారు. అనంతరం ఆలయ శిల్పిని సన్మానించారు. ఆలయ జీర్ణోద్ధరణ కమిటీ చైర్మన్ జంపన రామలింగరాజు, ఆలయ ఈఓ వీఎన్‌కే శేఖర్ పాల్గొన్నారు.

కొల్లేరు సమస్యకు శాశ్వత పరిష్కారం

కైకలూరు: కొల్లేరు సమస్యకు శాశ్వత పరిష్కారం ఎన్‌డీఏ ప్రభుత్వం ద్వారానే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. కొల్లేరు లంక గ్రామాలైన చటాకాయి, కొట్టాడ గ్రామాల్లో జలజీవన్ మిషన్ నిధులతో ఏర్పాటు చేసిన మైక్రో వాటర్ ఫిల్టర్, పైపులైను ద్వారా సోమవారం నీటిని విడుదల చేశారు. ఆయా గ్రామాల్లో జరిగిన సభల్లో కామినేని మాట్లాడుతూ చుట్టూ నీరు ఉన్నా తాగలేని పరిస్థితి కొల్లేరు ప్రాంతాల్లో ఉందన్నారు. ఆయా గ్రామాల్లో సమస్యలు, చేపల చెరువుల సాగు వంటి విషయాలపై చర్చించుకున్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, జెడ్పీటీసీ సభ్యురాలు కురెళ్ల బేబీ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బీసీజీ వ్యాక్సినేషన్

తోట్లవల్లూరు: బీసీజీ వ్యాక్సినేషన్ కొనసాగుతోంది. తోట్లవల్లూరుతోపాటు గ్రామాల్లోని ఆరోగ్య ఉప కేంద్రాల్లో ఆరోగ్య సిబ్బంది బీసీజీ వ్యాక్సినేషన్ వేస్తున్నారు. ప్రతి సోమ, గురువారాల్లో బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాయిప్రసన్న తెలిపారు. 60 ఏళ్ల వయస్సు నిండిన వృద్ధులతోపాటు మధుమేహ వ్యాధిగ్రస్తులకు, ధూమపానం అలవాటు ఉన్న వారికి బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్నట్లు తెలిపారు. నార్తువల్లూరు ఆరోగ్య ఉప కేంద్రంలో సోమవారం ఏఎన్ఎం కమలాక్షి, ఆశ కార్యకర్తలు వ్యాక్సిన్ వేశారు.



తోట్లవల్లూరులో వ్యాక్సిన్ వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

డీఎస్పీ శ్రీకాంత్‌కు మీడియా ప్రతినిధుల సత్కారం

గుడివాడరూరల్: బదిలీపై వెళ్తున్న గుడివాడ డీఎస్పీ పి.శ్రీకాంత్‌కు పట్టణంలోని మీడియా ప్రతినిధులు సోమవారం ఘనంగా సత్కరించారు. డీఎస్పీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి సమర్థవంతంగా విధులు నిర్వహించి, గుడివాడ సబ్ డివిజన్‌లో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడం, పట్టణంతో పాటు ఇతర మండలాల్లో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టడంలో డీఎస్పీ సఫలీకృతులయ్యారు. ఈ నేపథ్యంలో డీఎస్పీ శ్రీకాంత్‌ను మీడియా ప్రతినిధులు ఘనంగా సత్కరించి బొకేలు అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ డివిజన్‌లో బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ప్రజలతో పాటు మీడియా సోదరులు అందించిన ప్రోత్సాహం మరువలేనిదన్నారు. విధి నిర్వహణలో మీడియా సోదరులు అందించిన ప్రోత్సాహం, సహకారం గుర్తించుకుంటానన్నారు. కార్యక్రమంలో టూటౌన్ సీఐ ఎం.నాగదుర్గారావు, మీడియా ప్రతినిధులు వల్లభాపురం బుజ్జిబాబు, నందిగం పండుబాబు, దారం ఉపేంద్ర, అప్పికట్ల ఆడమ్‌స్మిత్, అశోక్, లోకేష్, సువర్ణబాబు పాల్గొన్నారు.

చేపల చెరువుల వేలం వాయిదా

ముదినేపల్లి రూరల్: మండలంలోని వడాలి శ్రీజగన్నాథస్వామి ఆలయానికి సంబంధించిన చేపల చెరువుల లీజు వేలం వాయిదా పడినట్లు ఆలయ ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయానికి మోటూరులో 110.90 ఎకరాల చేపల చెరువు ఉండగా వీటిని రెండు ప్లాట్లుగా విభజించి మూడు సంవత్సరాల కాల పరిమితికి సోమవారం మోటూరులో ఎండోమెంట్స్ ఇన్‌స్పెక్టర్ వి.సుధాకర్ ఆధ్వర్యంలో బహిరంగ వేలానికి సిద్ధమైనట్లు ప్రకటనలో తెలిపారు. వేలానికి హాజరయ్యే రైతులు ధరావత్తులు చెల్లించేందుకు ఆసక్తి చూపనందున వాయిదా వేసినట్లు తెలిపారు. ఈ చెరువులకు సంబంధించి లీజు వేలం ఎప్పుడు నిర్వహించేది తర్వాత తెలియజేస్తామని ప్రకటనలో పేర్కొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కైకలూరు: మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని వైవీఏన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత పేర్కొన్నారు. కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్, యూత్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలు, పొగాకు వినియోగ వ్యతిరేక అవగాహన సదస్సును సోమవారం నిర్వహించారు. యూత్ రెడ్ క్రాస్ కో–ఆర్డనేటర్ ఎం.హరిప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు ఒక్కసారి బానిసగా మారితే అందులో నుంచి బయటకు రావడం కష్టతరమన్నారు. ఇటీవల 15 నుంచి 25 సంవత్సరాల యువకులు ఎక్కువగా మత్తుకు అలవాటు పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. మరికొందరు సంఘ ద్రోహులుగా మారుతున్నారని తెలిపారు. బానిసలైన వారిని కేంద్రాల ద్వారా పరివర్తన తీసుకురావడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. యువకులకు మత్తు పదార్థాల వలన కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డి.ఉదయ ప్రకాష్, అధ్యాపకుడు ఇమ్మానియేలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సుజాత